ప్రజాశక్తి
మంగళవారం 30 జులై 2024
5
అల్లూరి సీతారామరాజు

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో ఉచిత కేన్సర్ ప్రాథమిక పరీక్షలు సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ క్యాన్సర్ పౌండేషన్, పాడేరు ఐటీడీఏ అధ్వర్యాన కేన్సర్ పరీక్షల శిభిరం నిర్వహించారు. రొమ్ము, గొంతు, గర్భాశసాయ, నొటి క్యాన్సర్ పరీక్షలతోపాటు ఈసిజీ పరిక్షలు నిర్వహించారు. క్యాంపు కో అర్డినేటర్ కనకేశ్వరరావు మాట్లాడుతూ, ఈనెల 30న డుంబ్రిగుడలో, 31న కించుమండలో ఉచిత క్యాన్సర్ పాథమిక పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గౌతమ్, వైద్యసిబ్బంది గిరిజనులు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

తగ్గుముఖం పట్టిన శబరి, గోదావరి

ఇంకా ముంపులోనే పలు గ్రామాలు

ముంపులోనే ఉన్న ఇంటి వద్ద విఆర్.పురం మండలం పెట్టవీధికి చెందిన మహిళ

ప్రజాశక్తి-ఎటపాక

కొద్ది రోజుల పాటు ఉగ్రరూపం దాల్చిన గోదావరి, శబరి నదులు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. శనివారం భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 53 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయగా, ఆదివారం నాటికి 49.50 అడుగులకు తగ్గింది. అది క్రమంగా తగ్గుతూ సోమవారం నాటికి 43.4 అడుగులుగా నీటి మట్టం నమోదైంది. దీంతో ఇంకా మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. వరద ఉధృతి ఇంకా పూర్తిగా తగ్గకపోవడంతో పలు పలు గ్రామాలు వరద ప్రభావం నుండి బయటపడలేదు. నందిగామ-మురుమూరు గ్రామాల మధ్య రహదారిపై వరద నీరు ఉండటంతో భద్రాచలం- కూనవరం రాకపోకలు ఇంకా పునరుద్ధరణ కాలేదు. నెల్లిపాక-వీరాయగూడం గ్రామాల మధ్య రహదారిపై కూడా వరద నీరు నిల్చే ఉంది.

విఆర్.పురం : గోదావరి, శబరి నదులు కొంత తగ్గుముఖం పట్టడంతో వరద బాధితులు ఊపిరి పీల్చుకుంటున్నారు. పునరావాస కేంద్రాల్లోనూ, పాకలు వేసుకొని నివాసమున్న బాధితులు సోమవారం పడవలపై స్వగ్రామాలకు వెళ్లి ముంపు పరిస్థితిని చూసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మతాళ్ల గూడెం, పెట్టవీధి గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రతి ఏటా వరదలకు చాలా నష్ట పోతున్నామని, తక్షణమే ప్రభుత్వం కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఇక్కడ నుండి తరలించాలని డిమాండ్ చేశారు. గృహాలు మునిగిన ప్రతి ఒక్కరికీ వరద సహాయం కింద రూ.10 వేలు ఇవ్వాలని, పడిపోయిన గృహాలను ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలని కోరారు.

చట్టి రహదారిపై వరద ఉండడంతో బారులు తీరిన వాహనాలు

చింతూరు : గత 17 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరద ఉధృతికి విలీన ముంపు మండలాల్లో పలు గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఒకవైపు గోదావరి ఉగ్రరూపం, మరోవైపు శబరి, సీలేరు నదుల ఉధృతి ప్రవాహంతో పలు గ్రామాలు నీట మునిగాయి. శబరి నది 43 అడుగులకు చేరడంతో చింతూరు మండల కేంద్రం సగభాగం ముంపునకు గురైంది. ఎట్టకేలకు సోమవారం తెల్లవారిసరికి మరల శబరి గోదావరి నదులు శాంతించాయి. అయినా భద్రాచలం -చింతూరు జాతీయ రహదారి ఇంకా ముంపులోనే ఉండడంతో వందల వాహనాలు రోడ్లపై బారులు తీరాయి.

వరదలో చిక్కుకున్న టిప్పర్.. ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్

చింతూరు మండలం నిమ్మలగూడెం రోడ్డు మలుపు వద్ద సత్తుపల్లి నుండి వస్తున్న టిప్పర్ ఆదివారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో వరద నీరు ఉందన్న విషయం తెలియక ముందుకు దూసుకుపోవడంతో వరద నీటిలో టిప్పర్ చిక్కుకుంది. డ్రైవర్ మర్రి నవీన్ తాటి చెట్టును ఆసరాగా చేసుకొని చెట్టుపై రాత్రంతా ఉండిపోయాడు. ఉదయం విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బోటుపై వెళ్లి డ్రైవర్ నవీన్‌ను ఒడ్డుకు తీసుకొచ్చారు. ఖర్చుల నిమిత్తం ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ రూ.500 అందజేశారు. డ్రైవర్ నవీన్ తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నివాసిగా తెలియజేశాడు. స్థానిక ఎస్సై శ్రీనివాస్, తహశీల్దారు నజీముల్లా షా ఆధ్వర్యంలో టిప్పర్ ప్రమాదానికి గురైన ప్రాంతంలో పర్యవేక్షించారు.

శ్రీరామగిరిలో కలెక్టర్ పర్యటన

విఆర్.పురం : వరద ముంపునకు గురైన మండలంలోని శ్రీరామగిరి గ్రామాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పర్యటించారు. వరద బాదితులు పడుతున్న ఇబ్బందులు, పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ తెలియజేశారు. పంచాయతీ పరిధిలోని ఒక్కో గ్రామంల 10 నుండి 20 మంది వరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని, గ్రామాలను ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కూడా ప్యాకేజ్ ఇవ్వాలని కోరారు. వరద సహాయం కింద ప్రతి ఇంటికీ రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ దినేష్ కుమార్ ఈ సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.లక్ష్మణరావు, విఆర్.పురం ఎస్ఐ, ఏఎస్ఐ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలు ముమ్మరం : జేసీ అభిషేక్ గౌడ్

ఎటపాక : వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టినట్లు అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ పేర్కొన్నారు. ఎటపాక మండలం గుండాల, గన్నవరం, సీతాపురం, నందిగామ గ్రామాలలో సోమవారం ఆయన పర్యటించారు. వాహనాల ద్వారా రేషన్ ఏ విధంగా అందుతున్నదీ ఆరా తీశారు. సీతపురం జడ్పీహెచ్ స్కూల్లోనే వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించి వరద సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మమ్మీ, తహశీల్దారు శేఖర్, ఎంపీడీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

వరదనీటిలో చిక్కుకున్న టిప్పర్ లారీ, ఇన్‌సెట్‌లో ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్ నవీన్

వరద ముంపు గ్రామాలను జాబితా చేర్చాలని వినతి

వరద ముంపు గ్రామాలను పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూ నష్ట పరిహారం చెల్లించాలని, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గన్నవరం సర్పంచ్ భద్రమ్మ, ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ (శైలజ), ఎంపీటీసీ కంతే రాజు జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎటపాక మండలంలో ఒక్క గ్రామాన్ని కూడా ముంపు జాబితాలో చేర్చకపోవడం దారుణమన్నారు.

నిత్యావసర సరుకులు అందించండి

కూనవరం : ముంపు గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలని పెద్ద ఆర్కూరు సర్పంచ్ నాగమణి, స్థానిక ఎంపీటీసీ డి.అమ్మాజీ, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దఆర్కూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్కూర్, రేపాక, భగవాన్‌పురం, బండారుగూడెం తదితర ముంపు గ్రామాలను సోమవారం పర్యటించి ముంపు పరిస్థితిని, బాధితులకు అందుతున్న సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పూర్తిగా తాటాకు ఇల్లులు అవ్వటం వల్ల ప్రతి ఏటా వరదలకు ఇళ్ల నేలమట్టం అవుతున్నాయని, మళ్లీ ఇళ్ల నిర్మించుకోవడానికి ప్రతి కుటుంబానికి రూ.15వేలు నుండి రూ.20 వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. అందువల్ల ముంపునకు గురైన ఇళ్లకు ప్రభుత్వం రూ.20వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి, సిపిఎం నాయకులు పాయం సత్యనారాయణ, బాబు బొర్రయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరదనీటిలో గ్రామ బాధితులను కలిసిన సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు

విలేకర్ల సమావేశంలో మాట్లాతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఎక్కడికక్కడ వరద సహాయక చర్యలు

- ముంపు తగ్గిన వెంటనే రూ.3000 చొప్పున అందజేత
- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు డివిజన్లోని విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక నాలుగు మండలాల్లో వరదలు సందర్భంగా బాధితులకు ఎక్కడికక్కడ సహాయక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. వరద బాధితులకు సహాయక కార్యక్రమాలపై చింతూరు ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమాశంలో కలెక్టర్ మాట్లాడారు. నాలుగు మండలాలకు నలుగురు ఐఎఎస్ అధికారులను, నలుగురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను వరద సహాయక చర్యల నిమిత్తం నియమించినట్లు చెప్పారు. నాలుగు మండలాల్లో 191 గ్రామాలు, 35,746 కుటుంబాలు వరదలకు గురయ్యారని, విఆర్.పురం, కూనవరం మండలాలు ఎక్కువ గ్రామాలు, చింతూరు, ఎటపాక మండలాల్లో కొన్ని గ్రామాలు వరద అధికంగా ముంపునకు గురైనట్లు తెలిపారు. గ్రామాల్లో కమిటీలు, ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు వరద సహాయక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వరద బాధితుల కోసం నాలుగు మండలాల్లో 49 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నాలుగు మండలాల్లో 3,900 మంది బహిరంగ స్థలాలలో ముంపు బాధితులు ఉన్నారని చెప్పారు. బాధితులకు 4,800 టార్ఫలిన్లు పంపిణీ చేశామని, 25 సోలార్ లైట్లు, 26 జనరేటర్లు, 300 ఫ్లాడ్ లైట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వరద బాధితుల కోసం బియ్యంతో పాటు సుమారు రెండు లక్షల వాటర్ ప్యాకెట్లు, చిన్నపిల్లల కోసం ఐదువేల లీటర్ల పాలు, పామాయిల్, ఇతర నిత్యావసరాలు, టార్చ్‌లైట్లు, కొవ్వొత్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రోడ్లు బంద్ అయి బయటకు రాని వరద బాధితులకు వరద సహాయక చర్యలు చేపట్టామన్నారు. 18 బోర్లు ఏర్పాటు చేశామని, బురద నీరు తాగకుండా 38 వేల క్లోరిన్ టాబ్లెట్లు అందుబాటులోకి తెచ్చామని, మరో 36 వేల క్లోరిన్ టాబ్లెట్లు అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం నాలుగు మండలాల్లో 79 మంది కార్మికులు పారిశుధ్య పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 763 ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, 16,500 మంది వరద బాధితులు అవుట్ పేషెంట్లుగా ఉన్నారని, 356 మంది గర్భిణులను గుర్తించి ఆసుపత్రులలో చేర్పించామని తెలిపారు. వివిధ సమస్యలపై 59 ఫిర్యాదులు వచ్చాయని, వాటి పరిష్కారం కొరకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 194 అంగన్వాడి కేంద్రాలలో బాల బాలికలకు పౌష్టికాహారం ఏర్పాటు చేశామన్నారు. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా టార్ఫలినట్లు, సత్యసాయి సంస్థ ద్వారా వెయ్యి దోమతెరలు అందించినట్లు చెప్పారు. వరద సహాయక కార్యక్రమాలకు రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వరద బాధితులకు రూ.3000 చొప్పున వరదలు తగ్గిన వెంటనే అందిస్తామన్నారు. వరద బాధితులకు ఏమైనా సమస్యలు ఉంటే మండలలోని కంట్రోల్ రూమ్‌కు కమిటీల ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కావూరి చైతన్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవరనం

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ గ్రామంలో అంగన్వాడి కేంద్రం శిథిలా వస్థకు చేరింది. 1982 సంవత్సరంలో అంగన్వాడి కేంద్రం నిర్మాణం చేపట్టారు. 20 మంది వరకు ప్రీ స్కూల్ పిల్లలు ఉన్నారు. సుమారు 42 సంవత్సరాలు దాటడంతో అంగన్వాడి భవనం శిదిటావస్థకు చేరింది. దీంతో, పిల్లల తల్లిదండ్రులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని గ్రామ పెద్దలు, టిడిపి నాయకులు తామర్ల సుబ్బారావు తదితరులు కోరుతున్నారు.

ఊడుతున్న భవనం పై పెచ్చులు

తెరుచుకున్న చాపరాయి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసాయి. దీంతో, చాపరాయి గెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో పర్యాటకులకు అవాంచనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యగా సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చాపరాయి జలపాతంలో ప్రవేశాలను నిలుపుదల చేశారు. సుమారు వారం రోజులపాటు ప్రవేశాలను నిలుపుదల చేసి వర్షాలు తగ్గడంతో జలపాతం తెరిపించి పర్యాటకుల ప్రవేశాలను పునరుద్ధరించారు. గెడ్డ ఉధృతి పూర్తిగా తగ్గక పోవడంతో లోపలికి ప్రవేశించిన పర్యాటకులు జలపాతం దగ్గరకు వెళ్లకుండా సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు.

వెదురు కొమ్ములకు గిరాకీ

వారపు సంతలు, మండల కేంద్రాల్లో విరివిగా అమ్మకాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్ : గిరిజన ప్రాంతాల్లో వెదురు కొమ్ముల సీజన్ ప్రారంభమైంది. వెదురు చెట్లకు మొదల్లో చిగుళ్లను గిరిజనులంతా పూర్వం నుంచి వెదురు కొమ్ములుగా పిలుస్తుంటారు. మన్యం వాసులు ఈ చిగుళ్లను సేకరించి వాటిని మంచి శాఖాహార వంటగా కూర వండుకొని తింటారు. తొలినాళ్లలో వెదురు కొమ్ములను ఆదివాసీలు మాత్రమే ఆహారంగా తీసుకునే వారు కాలక్రమంగా అన్ని వర్గాల ప్రజలు వెదురు కొమ్ములను ఆహారంగా తీసుకుంటున్నారు.

ఈ సీజన్ లో గిరిజనులతో పాటు మైదాన ప్రాంత ప్రజలు కూడా అధికంగా తింటుంటారు. వెదురు కొమ్ముల కూర మంచి రుచిగా ఉంటుంది. ఒకసారి ఈ కూర తిన్నవారు మరోసారి తినాల్సిందే. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వెదురు చెట్ల మొదళ్లకు చిగుళ్లు ఏర్పడ్డాయి. అడవులతో పాటు గిరిజనులు సొంతంగా వేసుకున్న వెదురు చెట్ల వద్ద ఈ చిగుళ్లను గుర్తిస్తు వాటిని వెంటనే సేకరించి ఇళ్లకు తీసుకు వస్తున్నారు. ఆ వెదురు చిగుళ్ల సేకరించకపోతే కొన్నాళ్లకు అవే నిటారుగా ఎదిగి వెదురు వనాలుగా పెరుగుతుంటాయి. ఈ సీజన్‌లో దొరికే వెదురు కొమ్ముల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, అవి తినడం ద్వారా ఆరోగ్యానికి దోహదం చేస్తుందని పూర్వం నుంచి గిరిజనుల నమ్మకం.

ఈ వెదురు కొమ్ములను వేపుడు, ఇగురు కూరలుగా వండుకుని తింటారు. కొంత మంది ఈ చిగుళ్లను పొడవుగా కోసి ఉడకబెట్టిన తర్వాత బాగా ఆరబెట్టి వరుగులుగా తయారు చేసుకుంటారు. ఆ వరుగులను సుమారు ఆరు నెలల వరకు ఇళ్లల్లో దాచుకుని ఎప్పుడు తినాలనుకున్న వాటిని నానబెట్టి కూరలుగా వండుకుంటారు. వారపుసంతలు, మండల కేంద్రాల్లో ప్రస్తుతం వెదురు కొమ్ములను గిరిజనులు అమ్మకాలు జరుపుతున్నారు. ఒక వాటా (ఐదు కొమ్ములు) రూ.50 ధరకు వెదురు కొమ్ముల వాటా అమ్ముడవుతుంది. పాడేరు డివిజన్‌తో పాటు రంపచోడవరం డివిజన్ లోని మారెడుమిల్లి, చింతూరు, అడ్డతీగల, రాజ వొమ్మంగి, వై.రామవరం ప్రాంతాల్లోను వెదురు కొమ్ములకు ఈ సీజన్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం అనంతగిరి, లంబసింగి, పాడేరు, సీలేరు, మారెడుమిల్లి, మోతుగూడెం ఘాట్ రోడ్ల వద్ద కూడా గిరిజనులు ఏర్పాటు చేసిన దుకాణాల్లో వెదురు కొమ్ములు విక్రయిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించే పర్యాటకులు, పలు వర్గాల ప్రజలు కూడా వెదురు కొమ్ముల వంటకాలు అలవాటవడంతో ఈ సీజన్ లో వారు కూడా కొనుగోలు చేస్తున్నారు.

సాంప్రదాయ ఆహారంగా తీసుకుంటాం

వర్షాకాలం ప్రారంభమైందంటే ఆదివాసీలు సాంప్రదాయ ఆహారంగా వెదురు కొమ్ములను తింటారు. లేత వెదురు కొమ్ములను సేకరించుకుని ఆదివాసీలు కూరగా చేసుకుని తినడం ఆనవాయితీ. కూర తయారు చేసే ముందు రెండు, మూడు సార్లు నీటితో శుభ్రం చేయాలి. ఆ తర్వాత ముక్కలుగా కట్ చేసి, నీళ్లలో ఎక్కువసేపు నానబెట్టిన తర్వాత కూర తయారు చేసుకోవాలి.

జె.శుభలక్ష్మి
సుండ్రుపుట్టు, పాడేరు

అందరూ ఇష్ట పడతారు

ఈ సీజన్ లో మాత్రమే వెదురు కొమ్ములు లభ్యమవుతాయి. లేత వెదురు నుంచి వెదురు కొమ్ములను సేకరిస్తాం. అడవులతోపాటు సొంతంగా వేసుకున్న వెదురు చెట్ల వద్ద ఈ చిగుళ్ళను సేకరించి ఇళ్లకు తీసుకు వస్తాం. వారపు సంతల్లో విక్రయిస్తాం. గతంలో మా గిరిజన ప్రాంతానికి చెందిన వారి కొనుగోలు చేసేవారు. ఇప్పుడు మైదానం ప్రాంతాలకు చెందిన అందరూ కూడా వెదురు కొమ్ములను కొనుగోలు చేస్తున్నారు.

బి.వరహాలమ్మ
చింతలవీధి, పాడేరు

కోతకు గురైన కల్వర్టు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో కురుస్తున్న వర్షాలకు సుజన కోట పంచాయితీ సుజన పేట గ్రామం వెళ్ళే ప్రధాన రహదారి ముత్యాలమ్మ తల్లి గుడి సమీపంలోని కల్వర్టు కోతకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న సుజన కోట సర్పంచ్ వెంకట రమేష్ సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్వర్టు కోతకు గురవడంతో వివిధ గ్రామాల పాదచారులు, ఆటోలు , ద్విచక్ర వాహనదారులు అనేక అవస్థలకు గురవుతున్నారని తెలిపారు. కోతకు గురైన కల్వర్టు వద్ద జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు.మత్స్యగెడ్డ నుండి బోటులో ప్రయాణాలు తప్ప వేరే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కోతకు గురైన కల్వర్టును మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కోతకు గురైన కల్వర్టు

అవగాహన కల్పిస్తున్న శివయ్య

సిల్వర్ ఓక్ మొక్కల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట గ్రామ పంచాయతీలో సోమవారం కప్పాడ గ్రామంలో 29 మంది రైతులకు సిల్వర్ ఓక్ మొక్కల పథక సంచాలకులు ఎం.శివయ్య మొక్కలు పంపిణీ చేశారు. తీసిన గుంతలను పరిశీలించారు. మొక్కల సంరక్షణపై రైతులకు వివరించారు. మొక్కలు సకాలంలో అందించినందుకు గాను ఉపాధి సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఓపెన్ వెల్ మరమ్మతుకు అంచనాలు తయారు చేసి పంపించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ వి.కిజియ, పెదబయలు మండలం ఈసీ సింహాచలం, ప్లాంటేషన్ సూపర్వైజర్ సింహాచలం పాల్గొన్నారు.

ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి- అనంతగిరి: విశాఖ, ఎస్.కోట మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మీదుగా అరకు ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వెళ్లే డీలక్స్ బస్సుకు కండక్టర్‌కు లేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ములియగుడ-అనంతగిరి బస్టాప్‌లలో పనిచేసే కండక్టర్ సోమవారం లేక పోవడంతో డీలక్స్ బస్సులు నిలపకుండా బస్సు డ్రైవర్ వెళ్లి పోయాడు. దీంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అనంతగిరి బస్టాప్ వద్ద ప్రయాణికులు

బ్లీచింగ్ చల్లిస్తున్న పీడీ

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలోని గడుతురు పంచాయితీ మగతపాలెం గ్రామంలో సోమవారం ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి స్థానిక అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన మెడికల్ క్యాంపును సందర్శించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు పలు సూచనలు చేశారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని ఆమె సూచించారు. గ్రామంలో పలుచోట్ల బీచింగ్ చల్లించారు.

అతిథిని సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులకు గీతం ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సు అభ్యసిస్తున్న అధ్యాపకులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) సోమవారం ముగిసింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, గీతం అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్‌ఇ విభాగం డీన్ ప్రొఫెసర్ శాంతి మాట్లాడుతూ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ బోధించే అధ్యాపకులు నిరంతరం నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కోడ్ చెక్, పైథాన్ ట్యూటర్, కోపైలెట్, రెప్యూట్ కోడ్, కృత్రిమ మేధ వంటి అంశాలపై అధ్యాపకులకు నూతన పరిజ్ఞానాన్ని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు) ప్రొఫెసర్ విజయ కుమార్ బోధించారు. కార్యక్రమంలో సిఎస్‌ఇ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీశ్వరి కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ హైమా పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం
రూ.1.97 కోట్లు

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్న భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను 33 రోజులకు గాను సోమవారం దేవస్థానం ఈవో సింగాల శ్రీనివాస్ మూర్తి పర్యవేక్షణలో తెరిచి లెక్కించారు. రూ.1 కోటీ 97 లక్షలా 6 వేలా 300 నగదు, బంగారం 100 గ్రాములు, వెండి 11 కిలోల 800 గ్రాములుచ విదేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు బంగారు హారం కానుక

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్నకు మధురవాడ దుర్గానగర్‌కు చెందిన కె సూర్యచంద్రరావు 350 గ్రాముల బంగారు హారాన్ని కానుకగా ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తికి సోమవారం అందించారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం బేడా మండప ప్రదక్షిణ చేయించి అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఎన్.ఆనంద్‌కుమార్ సత్కరించి స్వామి ప్రసాదాలను అందజేశారు.

రహదారిపై నిలిచిన వర్షపు నీరు

వాహనదారులకు తప్పని ఇక్కట్లు

నీటిలో నుంచి వెలుతున్న వాహనదారుడు

ప్రజాశక్తి - చింతపల్లి: అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులన్నీ ఛిద్రమయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండుకుని చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోనీ బెన్నవరం పంచాయతీ పరిధిలోని పోతురాజు గుమ్మలు, బెన్నవరం గ్రామాల మధ్య రహదారి, కాలువ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అస్తవ్యస్తంగా మారాయి. గడచిన కొన్నేళ్లుగా ఈ రహదారి గుంతలమయంగానే దర్శనమిస్తోంది. చిన్నపాటి వర్షానికి సైతం వర్షపు నీరంతా గుంతల్లో చేరి, ఈ రహదారిలో ప్రయాణం చేసేందుకు వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల లోతు నీరు నిలిచి ఉంటుందని వాపోతున్నారు. దీంతో, ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహన దారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే మార్గం గుండా అన్నవరం, జి.మాడుగుల, పాడేరుకు గిరిజనులు ప్రయాణిస్తుంటారు. రహదారుల మరమ్మతు చేపట్టి నీటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి -అనంతగిరి

గ్రామాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యం బాగుంటుందని ఎంపీపీ శెట్టి నీలవేణీ, సర్పంచ్ సోమ్మెల. రూతులు తెలిపారు. అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం, బారాజోలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల్లో పారిశుధ్య పనులు సోమవారం చేయించారు. అనంతరం ఎంపీపీ, సర్పంచ్ లు మాట్లాడుతూ, పశువుల పాకలను దూరంగా ఉంచుకోవాలన్నారు. కాచి వడపోసిన నీటిని తాగాలని, నీటి నిలువ ఉంచరాదని, దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రభాలే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలి ఇన్‌ఛార్జి ఎంపీడీవో నగేష్, సిడిపిఓ ఉమామహేశ్వరి, సచివాలయం సెక్రటరీ బాలకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వాటర్ ట్యాంకును శుభ్రం చేయిస్తున్న ఎంపిపి

శతశాతం పింఛన్లు పంపిణీ చేయాలి

మాట్లాడుతున్న ఎంపిడిఒ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఆగస్టు 1న పింఛనుదారులకు పింఛన్లు శతశాతం అందజేయాలని ఎంపీడీవో కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,పింఛనుదారులందరూ గ్రామాలలో అందుబాటులో ఉండాలని ముందస్తు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆగస్టు 1న సాయంత్రం లోపు పింఛన్లు పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అకాల వర్షాలతో కూలి గృహాలను, వంతెనలను, బాధిత కుటుంబీకులను గుర్తించాలన్నారు. గ్రామ పరిసరాల ప్రాంతాలలో పారిశుద్య పనులను చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలని నిరసన

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలో అజయపురం గ్రామానికి వంతెన నిర్మాణం చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ శివారు గిరిజన గ్రామంలోని గిరిజనులు జలద్రిగ్బందలో చిక్కున్నారని సోమవారం వారిని సందర్శించామని సిపిఎం మాడుగుల మండల కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కార్లి.భవాని తెలిపారు. సోమవారం తాటిపార్తి తారు రోడ్డు నుండి కాలినడకన గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గిరిజనులతో కలిసి గెడ్డలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ, గత రెండు వారాల నుండి కురుస్తున్న వర్షాలకు అజయపురం గెడ్డ ఉద్రుతంగా ప్రవహించడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువులు, విద్య, వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గ్రామానికి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గిరిజనులు పాలకులకు మోరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు.జల ద్రిగ్బందలో చిక్కుకుంటున్న గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వంతాల కేశవరావు, మచి రాజు, పోతురాజు, రాజులమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : యువతిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని పిఎం.పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నార్త్ ఎసిపి వివరాలు వెల్లడించారు. అనకాపల్లి జిల్లా బైతవరం గ్రామానికి చెందిన బొడ్డు దివ్య కొమ్మాది సమీపంలోని ఒక వసతి గృహంలో ఉంటూ స్థానికంగా ఉన్న స్వీట్స్ షాప్‌లో పనిచేస్తోంది. ఈ నెల 22వ తేదీన రాత్రి పది గంటల సమయంలో దుకాణం సమీపంలోని బాత్రూమ్‌కు వెళ్లింది. బాత్రూం నుంచి బయటకు వచ్చిన దివ్యపై వెనకనుంచి మధురవాడ భగవంతుడు కాలనీకి చెందిన చేవ్వేటి సురేష్ దాడిచేసి ఆమె వద్ద ఉన్న సెల్ ఫోన్లు పట్టుకొని పోయాడు. దివ్య అపస్మారక స్థితిలో పడిపోయింది. అర్ధరాత్రి తెలివి వచ్చాక వసతి గృహానికి వెళ్లి విషయం చెప్పింది. వసతి గృహం వార్డెన్‌తోపాటు మిగిలిన వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దివ్యను కెజిహెచ్‌కు తరలించారు. అనంతరం పోలీసులు విచారణ చేపట్టారు. బాధితురాలు ఫోన్ ఆధారంగా సత్తిబాబును పట్టుకొని విచారించారు. ఈ ఫోన్ ఓ ఇద్దరు వ్యక్తులు తెల్లటి స్కూటీపై వచ్చి పడేశారని, తాను తీసుకున్నానని సత్తిబాబు వివరించారు. ఫోన్ పడేసిన వ్యక్తి శ్రీనివాసనగర్‌కు చెందిన అప్పన్నగా గుర్తించి సిసి కెమెరాలు పరిశీలించారు. నిందితుడు సురేష్‌గా గుర్తించారు. నిందితుడు మత్తు పదార్థాలకు బానిసయ్యాడనే నేపంతో మానసిక ఆసుపత్రిలో చేరి సోమవారం ఇంటికి వచ్చాడు. నిందుతుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పిఎం పాలెం సిఐ వై.రామకృష్ణ, పద్మనాభం సిఐ శ్రీధర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -గొలుగొండ: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కేడీపేట పిహెచ్సీ వైద్యాధికారి హరి ప్రవీణ్ సూచించారు. మండలంలో గిరిజన గ్రామీణ తాళచీడికాడలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను ఆచరించాలన్నారు. కాచి వడపోసిన నీటినే తాగాలన్నారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో బిపి, షుగర్, జ్వరాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రసాద్, ఏఎన్ఎం ఉమా, ఆశా కార్యకర్తలు మంగతల్లి, అచ్చి పాప తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి కేటాయింపులు ఏవీ?

ప్రజాశక్తి -నక్కపల్లి: కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. నక్కపల్లిలో సిఐటియు కార్యాలయం వద్ద సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ కాపీలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఇటీవల పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి తీవ్రంగా ద్రోహం, అన్యాయం చేశారన్నారు. రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు (ఎం ఎస్ పి) చట్టం చేస్తానని నిండు పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చిన బిజేపీ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేయమంటే మనసు రాని బిజేపీ కార్పొరేట్‌లకు మాఫీ చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతుల రుణాలు మాఫీ చేయాలని, యాభై సంవత్సరాల నిండిన రైతులకు ఐదు వేల రూపాయలు పింఛను ప్రకటించాలని కోరారు. 2020 విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్, నాయకులు ఎం.త్రినాధరావు, ఎం.బాపూజీ, ఎస్.అప్పలరాజు, వరహాలు, ప్రసాద్, ఎర్రయ్య, సత్తిబాబు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సదుపాయాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: బిసి సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జీ.గీతాకృష్ణ కోరారు. సోమవారం ఏబిసిడబ్ల్యూఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గీతాకృష్ణ మాట్లాడుతూ, నర్సీపట్నం డివిజన్‌లోని అన్ని మండలాల్లో బిసి (పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్) హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, బీసీ సంక్షేమ హాస్టల్లో ఫ్యాన్లు, మరుగుదొడ్లు సరిగా లేవన్నారు. హాస్టల్లో శుభ్రత లేకపోవడంతో జ్వరాలకు గురవుతున్నారన్నారు.దోమ తెరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో వార్డెన్లు అందుబాటులో లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపురం గ్రామస్తులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

బరకాలు, నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం, ఎస్‌టి కాలనీ, ఎస్సీ కాలనీ ప్రజలకు 320 బరకాలు జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, స్థానిక సర్పంచ్ పూనం, సరోజిని, సిపిఎం నాయకుల చేతుల మీదుగా బరకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, నాయకులు పంకు సత్తిబాబు, టిడిపి నాయకులు ప్రకాష్ రావు, కన్నారావు, వైసిపి నాయకులు చిక్కాల బాలు, వీఆర్వో దూలయ్య, సచివాలయ సిబ్బంది తరుణ్, బుచ్చిరాజు పాల్గొన్నారు.

కూనవరం : ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సహృదయ ఫౌండేషన్ సహకారంతో వరద ప్రభావిత గ్రామం లింగాపురం గ్రామస్తులకు నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ జరిగింది. 100 కుటుంబాలకు 6 రకాల నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ప్రేరణ ఫౌండేషన్ ఫౌండర్ శరత్ సుదర్శి, పిఎన్ఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐవి, సంస్థ సభ్యులు సుబ్దిన్ రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సోడే శంకర్, డివైఎఫ్ఐ నాయకులు ఆకిశెట్టి రాము, పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు

విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించండి

కూనవరం : వరద ముప్పు గ్రామాలకు విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పెదర్కూర్ గ్రామంలో సర్పంచ్ మడకం నాగమణి అధ్యక్షతన సోమవారం జరిగిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పెంటయ్య మాట్లాడుతూ కొన్ని రోజులుగా గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదని, ఈ సమస్యపై గతంలో అనేక సార్లు ఐటిడిఎ పిఒ, కలెక్టర్‌కు తెలియజేశామని చెప్పారు. అలాగే ముంపు గ్రామాల్లో బరకాలు, దోమతెరలు ఇవ్వాలని పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటీసీలు సర్పంచులు సోడే శంకర్, బొగ్గ వెంకమ్మ, పాయం సత్యనారాయణ, బాబు బోరయ్య పాల్గొన్నారు.

డొంకరాయి నుంచి నీటి విడుదల నిలుపుదల

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం గేట్లు మూసివేసి దిగు ప్రాంతానికి నీటి విడుదలను నిలిపివేశామని ఏపీ జెన్కో ఈఈ పి.విజయ్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గడంతో జలాశయంలోకి వరద నీరు తగ్గుముఖం పట్టిందని, జలాశయం నీటిమట్టాలు సోమవారం ఉదయం 8 గంటలకు 1334 అడుగులు స్థిరంగా ఉందని పేర్కొన్నారు. డొంకరాయి పవర్ కెనాల్ నుంచి యధావిధిగా పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 3000 క్యూసెక్కులు నీటి విడుదల కొనసాగుతుందన్నారు.

ఎఒబిలో ముమ్మరంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు

ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టుల వారోత్సవాలు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో అదనపు పోలీసు బలగాలను మొహరించి జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొన్ని నెలల క్రితం మావోయిస్టులు సుమారు 100 మంది వరకు ఎన్‌కౌంటర్ గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రగులిపోతున్న మావోయిస్టు ప్రతీకార చర్యలకు పాల్పడతారని ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికతో తనిఖీలు ముమ్మరం చేశారు. ఎఒబి కలాఫ్ ఏరియాలో మావోయిస్టుల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. మావోయిస్టు సానుభూతిపరుల ఆచూకీ కోసం గిరిజన గ్రామాల్లో గోప్యంగా కూపీ లాగుతున్నారు. మరో వైపు బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపడుతున్నారు. ప్రతి ఏడాది మావోయిస్టు వారోత్సవాలకు వారం రోజుల ముందే ప్రకటన చేసేవారు. కాని ఈ ఏడాది అటువంటి ప్రకటనలు ఏమీ కనిపించకపోవడంతో పోలీసులకు అంతుపట్టడం లేదు. మరోవైపు మావోయిస్టులో వారోత్సవాలు నేపథ్యంలో పోలీసుల ఆదేశాల మేరకు విశాఖపట్నం డిపో ఆర్టీసీ అధికారులు విశాఖ వయా చింతపల్లి, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులను రద్దు చేశారు.

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తం నైట్ సర్వీస్ బస్సులు రద్దు

తనిఖీలు చేపడుతున్న పోలీసులు

కొండ వాగులు దాటొద్దని హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్, రంపచోడవరం ఎఎస్‌పి ఆదేశాల మేరకు మారేడుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మండలంలో ప్రమాదకరమైన వాగుల దగ్గర సోమవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మారేడుమిల్లి, గుర్తేడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని సున్నంపాడు నుండి నూరుపూడి వెళ్లే మార్గంలో ఉన్నటువంటి కొండ వాగు వద్ద, మారేడుమిల్లి నుండి పాతకోట వెళ్లే మార్గంలో ఉన్న బొడ్లంక పెళ్లి రేవు కలువ వద్ద, ఆకు మామిడి కోట నుండి పుల్లంగి వెళ్లే మార్గం మధ్యలో ఉన్నటువంటి కాలువ వద్ద ఈ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ రుద్రరాజు భీమరాజు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కూర్చున్న వర్షాలకు మండలంలో పలుచోట్ల కొండ వాగులు పొంగి ప్రవహించడంతో ఈ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరదలు తగ్గుముఖం పట్టిన వరకు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మారేడుమిల్లి ఎస్ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి కమ్మరి తోట గ్రామంలో పారిశుధ్యం నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని ఆ పంచాయతీ కార్యదర్శి వాసం శ్రీనివాస్ వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ మూడు సంవత్సరాలు చిన్నారి స్పందన వాంతులు విరోచనాలతో మృత్యువాత గురైనట్లు పలు పత్రికల్లో వచ్చిందని, దీంతో హుటా హుటినా సిబ్బందితో వచ్చి పారిశుధ్య పనులు చ చేస్తున్నామని చెప్పారు. ఎవరైనా అనారోగ్యం పాలైతే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్. రాజు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ బి. రాంబాబు, వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.బుజ్జి, ఆశ వర్కర్ కాంతమ్మ, గ్రామస్తులు కె.ప్రసాద్, కే.సురేష్, శ్రీను, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

యువత అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు : యువత అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సీలేరు ఎస్ఐ జె.రామకృష్ణ యువతకు పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ, వలస గెడ్డ కొత్తూరు, బూసి కొండ గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు.

అనంతరం యువతతో సమావేశమై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హితవుపలికారు. గ్రామాల్లో అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని, అటువంటి చర్యలకు ఎవరైన పాల్పడితే కఠిన చర్యలు తప్పని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు.

గిరిజనులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మారేడుమిల్లి మండలంలో ఉన్న కొంతమంది గిరిజనుల గృహాలు ధ్వంసమయ్యాయని, కొండ పోడు పొలాలకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వాటికి నష్టపరిహారం చెల్లించాలని వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గొర్లె అనిల్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నష్టపోయిన గిరిజన కుటుంబాలకు నిత్యవసర సరుకులు, నష్టపరిహారం అందించాలని కోరారు.

చెట్టు విరిగి పడి ఇల్లు ధ్వంసం

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో వరదలు కారణంగా యర్రం భవానీ ఇంటిపై పెద్ద టేకు చెట్టు విరిగి పడటంతో ఆ గృహం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్, వార్డ్ మెంబర్ రవివర్మ సంఘటనా స్థలాన్ని పరిశీలించి భవానిని పరామర్శించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 12 రోజులుగా వరద నీటిలో గ్రామం ఉండడంతో చెట్లు విరిగి పడుతున్నాయని చెప్పారు. ఇల్లు ధ్వంసమైన భవానీకి ప్రభుత్వం గృహం కట్టించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద గెద్దాడ పాఠశాలలో 'శిక్షా సప్తాహ్'

ప్రజాశక్తి-రంపచోడవరం : పెద్ద గెద్దాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో భాగంగా న్యాయవాది టి.వీరబాబు అందించిన 88 మంది ఆపిల్ పండ్లును విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు, హెచ్ఎం ఎం.రాజేశ్వర రావు పాల్గొన్నారు.

కూలిన రేకుల షెడ్డును పరిశీలించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కూలిన రేకుల షెడ్డుకు సహాయం అందించాలి

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు వాడబజార్‌లో వడారి రాము ఇంటికి ప్రహరీకి ఆనుకొని ఉన్న రేకుల షెడ్డు వరద ముంపుతో కూలపోయిందని, దానికి పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం నాయకులు వాడ బజారులో వడారి రాముని పరామర్శించి, కూలిన షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ పోలవరం ముంపు ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఎంపిపి సార్ల లలిత కుమారి, జడ్పిటిసి సభ్యులు గొర్లె బాలాజీ బాబు, సర్పంచ్ కొండా జాకోబ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో పాఠశాల విద్యార్థులు 249 మంది, కళాశాల విద్యార్థులు 80 మంది ఒకే చోట ఉండడంతో మరుగుదొడ్లు, హాస్టల్ సదుపాయాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులు విశాలంగా లేకపోవడం, వసతి గదుల్లోనే తరగతి గదులు నిర్వహించడంతో చదువుపై శ్రద్ధ చూపించలేకపోతున్నామని వారు తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీపీ, జడ్పిటిసి, సర్పంచ్ ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు భోజనం దగ్గరుండి వడ్డించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిఎస్.కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైడ్ వాల్స్‌లేని వంతెనను చూపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాణిశ్రీ

వంతెనకు సైడ్ వాల్స్ నిర్మించి ప్రమాదాలను అరికట్టాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలో కుట్రవాడ-బోదులూరు ప్రధాన రహదారిలో ఉన్న వంతెనకు సైడ్ గోడలు పడిపోయి చాలా ప్రమాదకరంగా ఉందని, తక్షణమే అధికారులు సైడ్ వాల్స్ నిర్మించి ప్రమాదాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. ప్రమాదకరంగా ఉన్న వంతెన ప్రాంతాన్ని సోమవారం ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మారేడుమిల్లి అత్యధిక మంది పర్యాటకులు గుడిస పర్యాటక ప్రాంతానికి వస్తున్నారని తెలిపారు. ఈ మార్గంలోని కుట్రవాడ-బోదులూరు ప్రధాన రహదారిపై నిర్మించిన బ్రిడ్జీల సైడ్‌వాల్స్ శిథిలం కావడంతో ప్రమాదకరంగా ఉన్నాయని, ప్రమాదకరంగా ఉన్న వీటిని అధికారులు గుర్తించకపోవటం అత్యంత దారుణమన్నారు. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం భారీగా ఉంటుందని, ఇప్పటికైనా ఎంపిడిఒ, ఐటీడీఏ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వంతెనపై సైడ్ గోడలు ఏర్పాటు చేయాలని కోరారు. లేకుంటే ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.